# చాపల్యం

శ్రీ సత్యమూర్తి

జీవిత పథంలో చాలా దూరం ప్రయాణం చేసి ఒక చోట ఆగి గతజీవితాన్ని జ్ఞాపకం చేసుకుంటూంటే, నా జీవితంలో మధురస్మృతులకన్న బాధామయ స్మృతులే ఎక్కువగా కనిపిస్తున్నాయి. గొప్ప పొరబాటు చేసి చేసేతులా అమృతభాండాన్ని ఒలకపోసుకున్నాను. స్వర్గమయ జీవితంలో నరకాన్ని సృష్టించుకున్నాను. కళామయజీవితాన్ని శోకమయం చేసుకున్నాను. పశ్చాత్తాపంతో, వ్యథాదహ్యమాన హృదయనై, నా వ్యక్తిగత విషాదగాథను మీకు చెప్పడం నా హృదయభారాన్ని తగ్గించుకొందామనే! బాధనుంచి ఉపశమనంపొందాలని, సానుభూతి నాశించి, చెబుతున్నాను.

నాకు పెళ్ళీడు వచ్చినప్పటినుంచీ, నాన్న కాళ్లరిగిపోయేట్టు తిరిగాడు వరులకోసం. పెళ్ళిచూపులకి వచ్చినవాళ్లందరిచేత నిరాకరింపబడ్డాను. కారణం? ......నా రూపం వారికి నచ్చలేదు. నేను అనాకారినట! నల్లగా ఉన్నానట. ఆరోజు నాకు బాగా జ్ఞాపకం. ఒకతను వచ్చాడు...నన్ను చూడ్డానికి. రెండు రోజుల క్రితమే మరొకరిచే "నిరాకృతకన్యనై," నా బ్రతుకును గూర్చి ఏదో ఆలోచించుకుంటూ, నా గదిలో కిటికీవద్ద కూర్చున్నాను. గుమ్మంవద్ద జట్కా బండి ఆగినచప్పుడైంది. ఎవరా! అని అనుకుంటూండగానే, నాన్న వచ్చి, "త్వరగా ముస్తాబు చేసుకో శారదా. నిన్ను చూడడానికి వచ్చారు" అన్నారు. నిర్లిప్తతతో నవ్వాను. నాకు తెలుసు, "ఇప్పుడొచ్చిన పెద్దమనిషికూడా అంగీకరించడని." అయినా నాన్నను సంతృప్తిపరచడంకోసం ముఖం కడుక్కుని, చీర మార్చుకుని వచ్చాను. అతడొకకుర్చీలోను, ఆ అబ్బాయి నాన్నగారు మరో కుర్చీలోను కూర్చున్నారు. నేను హాల్లోకివచ్చి చాపమీద కూర్చోబోయాను. ఆ అబ్బాయి నాన్నగారు నన్ను వారించి, "యిలా కుర్చీలో కూర్చోమ్మా" అన్నారు. కూర్చున్నాను. మామూలు పెళ్ళిచూపుల యింటర్వ్యూలాగ నన్ను పరీక్షించడం జరిగింది. ఆ అబ్బాయిని కాలేజీలో చూచినట్లు జ్ఞాపకం. అతనో సంస్కర్తలా పోజుపెట్టి, కాలేజి డిబేట్సులోను, నాటకాలలోను పాల్గొనేవాడు. నేను ఇంటర్ మొదటి సంవత్సరంలో ఉన్నప్పుడు అతను బి. ఏ. రెండవ సంవత్సరంలో ఉన్నాడు. అతన్ని నేనెందుకు మరచిపోలేదంటే, అతని అసలైన సంస్కారాన్ని నేను చూచాను కాబట్టి.

"మిమ్మల్ని కాలేజిలో చూచినట్లు జ్ఞాపకం. మీరు ప్రార్థనగీతం పాడేవారుగదూ, సమావేశాల్లో" అన్నాడు.

"అవునండీ" అని తలవంచుకునే ముక్తసరిగా జవాబిచ్చాడు.

కాలేజీ వార్షికోత్సవం రోజున నా ప్రార్థన తర్వాత నా స్నేహితురాళ్ళంతా నా చుట్టూచేరి, "చాలా బాగా పాడావు. శారదా" అని నన్ను పొగడుతున్నారు.

"కోకిలచుట్టూ కాకులు చేరేయిరా" అని ఒక కంఠం వినిపించింది దగ్గరలోనే. మనస్సు చివుక్కుమని వెనక్కి తిరిగి చూశాను. అతడు, మరి కొందరు స్నేహితులు, మావైపు చూస్తూ వెక్కిరిస్తూ నవ్వుతున్నారు. చాలా అసభ్యకరమైన మాటలన్నీ మాట్లాడుతున్నారు. నేను దూరంగావెళ్ళి కూర్చున్నాను. రాత్రి యింటికి వెళ్ళేటప్పుడుకూడా అసహ్యంగా అల్లరిచేస్తూ మా వెంటబడి నన్నూ, నా స్నేహితురాండ్రనూ, మా యిళ్ళదాకా సాగనంపారు. అందుకనే, అతన్ని నేను మరచిపోలేదు. బహుశా అతనికి తెలిసివుండదు "నే నతని గుణగతాలు గుర్తించానని."

అందుకనే, నన్ను తను గుర్తించినట్లు మాట్లాడాడు. అతనితో 'నాయింటర్వ్యూ' అయిపోయింది. నేను నా గదిలోకి వెళ్ళిపోయాను. హాల్లోనించి వాళ్ళ మాటలు నాకు బాగా వినబడుతున్నాయి. మా నాన్న

వాళ్ళని ప్రాధేయపడుతున్నట్టుంది. "అబ్బే! అయిదు వేలకి తక్కువైతే చేసుకోవడానికి వీల్లేదండి" అన్నాడు ఆ అబ్బాయి నాన్న. "మా అబ్బాయి ఏదో ఆధునిక భావాలు, సంస్కారము కలవాడు కాబట్టి, మీ అమ్మాయిని చేసుకోవడానికి అసలు ఒప్పుకుంటున్నాడు."

అత నేమంటాడో వినాలనిపించింది నాకు.

"అంతేనండీ! మీ అమ్మాయిలాంటి అందవికారిని పెళ్ళిచేసుకోవడానికి, అంతకన్న తక్కువైతే ఎవరొప్పుకుంటారండీ" అన్నాడు.

అతనిమాటలు వినేటప్పటికి నాకు తలతిరిగినట్టయింది. కుప్పలా కూలిపోయాను. వాళ్ళు వెళ్ళిపోయారు. టేబిల్ మీద అద్దంలో ఒకసారి చూచుకున్నాను. నల్లగా కనబడింది నా ప్రతిబింబం. అంత నల్లగా ఎందుకుపుట్టాలి నేను! భగవంతుడు నన్నెందుకు ఇంత అందవికారంగా సృష్టించాడు? మళ్ళీ అద్దంలో చూచుకున్నాను. నామీద నాకే రోత పుట్టింది. కోపంతో అద్దాన్ని నేలకేసికొట్టాను. అద్దం ముక్కలు ముక్కలైంది. ప్రతిఅద్దంముక్కా నన్నూ, నారూపాన్నీ పరిహసిస్తున్నట్లనిపించింది. ఇంతబాధని, అవమానాన్నీ ఎలాభరించడం...ఆక్షణంలో నే గుండె ఆగి మరణిస్తే ఎంతబాగుంటుంది!...నావంటి నిర్భాగ్యురాలికి అంత అదృష్టంకూడానా. పూర్వజన్మలో చేసుకున్న ఏకొద్ది పుణ్యంవల్లనో, ఒకస్వర్గమయజీవితంలో అడుగుపెట్టి అక్కడనించి మళ్ళీ, జారిపడిపోయిన నాకథను మీకు అప్పుడెవరు చెబుతారు!...

నాబాధను గుండెలోదాచుకుని, మంచంమీద పడుకున్నాను. అద్దంపగిలిన శబ్దం విని, నాన్న గదిలోకి వచ్చాడు. నాన్నముఖం చూడలేక మొహం అవతలకి తిప్పి పడుకున్నాను. పాపం!...నాకోసం ఆయనెంత కుమిలిపోతున్నాడు! ఈజన్మలోనాకు పెళ్లిఅయ్యే రాత లేదేమో అనుకున్నాను. నాన్న నాదగ్గరికివచ్చి మెల్లిగా తలనిమిరాడు. నాకు నోటమాటరాలేదు. ఆయనకూడా మాట్లాడలేకపోయాడు. మాట్లాడకుండా బయటికివెళ్లాడు.

## 2

రోజులు గడుస్తున్నాయి...చీకట్లువస్తున్నాయి, పోతున్నాయి. వెన్నెలలు వస్తున్నాయి...పోతున్నాయి. క్యాలెండర్లలో కాగితాలు చినిగిపోతున్నాయి. ఏమార్పూలేకుండా యాంత్రికంగా గడచిపోతోంది నాజీవితం. ఒకరోజున ఏం తోచక పత్రిక తిరగేస్తున్నాను అందులో ఒకప్రకటన కనుపించింది. "ప్రఖ్యాత చిత్రకారుడు రవికుమార్ గారికి, చదువు, సంస్కారంగల వివాహయోగ్యయైన వధువు కావాలి. రవికుమార్ గారికి ఫోటోలు వివరాలతోసహా పంపితే, వారి కిష్టమైన కన్యను ఎన్నుకుంటారు" అని ఉంది. ప్రకటన ప్రక్కన అతని ఫోటో కూడా ఉంది.

రవికుమార్ గొప్ప చిత్రకారుడనీ, అతని చిత్రాలు చాల మనోజ్ఞంగా ఉంటాయనీ, అతని చిత్రాలు చూస్తూంటే, మన మనస్సు ఏదో ఊహాలోకంలో విహరించినట్టుంటుందని, చాలమంది చెప్పగా విన్నాను. అతని చిత్రాలు రెండు, మూడు నేను చూచాను కూడా! నేను చూచిన రెండు చిత్రాలు: మనుచరిత్రలోని కవితాపితామహుని రెండు పద్యాలకు ప్రతిసృష్టి! రూపకల్పన! ప్రవరాఖ్యుడు పాదలేపం ప్రభావంవల్ల హిమవత్పర్వతప్రాంతాలకి వచ్చి, అచ్చటగల ప్రకృతిసౌందర్యానికి ముగ్ధుడవుతాడు. తరువాత ఔషధహీనుడై, దారి తప్పి వరూధిని ఉన్నచోటికి వస్తాడు. అచ్చటి ఉద్యానవనంలో తీయమావినున్నవద్ద, చంద్రకాంతశిలా వేదికపై కూర్చుని, వీణవాయిస్తూ, తన గానమాధుర్యంతో మైమరచి, కన్ను లరమోడ్చి, ఉన్న సురలోక సుందరిని,...వరూధినిని,...చూస్తాడు. ఇది మొదటి చిత్రం. రెండవది; అబ్బురపాటుతో, విశాలమైన కళ్ళతో, మనసులో ఏవో కోరికలు ఊరుతూంటే, వయ్యారంగా, వెన్నెలలు ప్రసరిస్తూన్న చూపులతో వరూధిని పురుష సౌందర్యమంతా మూర్తీభవించిన ప్రవరుని చూచింది. ఆమె శరీరం మన్మథాగ్ని ప్రభావంవల్ల పులకరించింది. కస్తూరిబొట్టు కరిగిపోయినది! మోహవిభ్రాంత అయింది!!

ఆ చిత్రాలు చూస్తూ, నన్ను నేను మరచిపోయాను. ఊహాలోకపు సౌందర్యంలోని లోతుల్ని వెలికితీసి, అసమానమైన తన భావనాశక్తివల్ల వాటికి రూపాన్ని కల్పించాడు, రవికుమార్. సౌందర్యానికి ప్రాణంపోశాడు. అలాంటి సౌందర్యారాధకుడు, కళాపిపాసి, కోరితే, నిండుహృదయంతో ఏ యువతి అతన్ని వరించడానికి ప్రయత్నించదు.

ఇలా, నే నాలోచిస్తూండగా నాన్న వచ్చారు. ఆయన చేతిలోకూడ అదే పత్రిక ఉంది.

"అమ్మాయి...శారదా. ఈ ప్రకటన చూశావా" ...అన్నారు.

"చూశాను నాన్నా" అన్నాను.

"నీ ఫోటోకూడ ఒకటి పంపుదాం"అన్నారు.

నేను మౌనంగా ఊరుకున్నాను...నాన్న కేమో ఆశ. పదిరాళ్ళువేస్తే...ఏదో ఒకటి తగులుతుందని... నా ఫోటో ఒకటి ఫుల్ సైజులోను, మరొకటి బస్టు వరకు,...రెండూ పంపాము.

ప్రఖ్యాత చిత్రకారుడు...ఎలాంటి స్త్రీనైన చలింపజేయగల రూపం గల రవికుమార్, అందరిచేత నిరాకరింపబడ్డ నన్ను వరిస్తాడని నే నెలా అనుకోను!

వారంరోజులు గడిచాయి. ఆ రోజు ఆదివారం. అప్పుడే స్నానంచేసి, హాల్లో ఈజీచైర్ లో కూర్చుని, నవల, "అరక్షణీయ" చదువుతున్నాను. 'జ్ఞానద' పడే బాధలకి నా మనసు చలించింది. "ఎంత నిండైన హృదయ మామెది......! నేను కూడా జ్ఞానదవంటి దాన్నే. కాని ఆమెకు ప్రేమించడానికి 'అతులు' డున్నాడు. నిర్భాగ్యురాల్ని!...నా కెవరూ లేరు," అని ఆలోచిస్తూ కథాగమనంలో మునిగిపోయాను.

"టెలిగ్రాం" అన్న కేకతో నేను పుస్తక ప్రపంచంలోనుంచి బయటపడ్డాను. ఎక్కడనుంచి వచ్చిఉంటుందా అని ఆలోచిస్తూ, టెలిగ్రాం చించి చూశాను. ఆశ్చర్యంతో నా నోట మాట రాలేదు. "ఇది సంభవమా" అనుకున్నాను. కళ్ళు నులుముకుని మళ్ళీ చూశాను....అదే......"సంతృప్తుడను....ఈ రోజు మెయిలులో వస్తున్నాను......రవికుమార్" అని ఉంది.

నాన్న వచ్చాడు. నా చేతిలోవున్న టెలిగ్రాం తీసుకుని చదివాడు...ఆయన ఆశ్చర్యానికి మేర లేదు. నాకు ఒకవైపు అవ్యక్తమైన ఆనందము...మరోవైపు కించిత్ భయము కలుగుతున్నయ్. నాలో ఏం చూసి నన్ను ఎన్నిక చేసుకున్నాడు...అతడు నా నిజ స్వరూపాన్ని చూశాడంటే....ఇంకేముంది...తిరుగు రైలుకే వెళ్ళిపోడూ! ఈ విషయం తెలుచుకున్నప్పుడు బాధ కలిగింది...అతన్ని మోసం చేశామేమో...అని. రైలుకు వేళ అవుతూన్నకొద్దీ...నా గుండె వేగంగా కొట్టుకోవటం ప్రారంభించింది.

రైలు వచ్చింది. రవికుమార్ రానేవచ్చాడు! ఇంట్లోకి రాగానే...మా నాన్న వారికి స్వాగతం చెప్పారు. ఇద్దరూ హాల్లో కూర్చున్నారు. నేను నాగది లోనుంచి బయటికిరాలేదు. ఏదో చెప్పలేని సిగ్గూ, భయమూ నన్నావరించివేశాయి. ఆక్షణంలోని మాన సికస్థితిని వర్ణించలేను. మనసు ఉయ్యేలలా ఊగుతోంది. ఒక రక్తపుచుక్కని మైక్రోస్కోప్‌లో చూస్తే...అందు లోని వేలకొద్దీ కణాలు...ఒకదాని నొకటి గుద్దుకొని ఎలా వేగంగా, ముందుకి, వెనక్కి తిరుగుతూం టాయో...అలా నా మనస్సులో అస్పష్టమైన భావాలు అనేకం సంచరిస్తున్నాయి.

ఈ వ్యథలోనుంచి తేరుకుని...ద్వారానికున్న తెర కొద్దిగా పక్కకు తొలగించి చూశాను...అబ్బ! ఎంతందంగా ఉన్నారు. అబద్ధ మెందుకు చెప్పాలి... అయన్ని చూచిన ఆ క్షణంలో నే...ప్రవరాఖ్యుని చూచిన వరూథినిలా అయిపోయాను! నాన్న నన్ను గమనించి...

"శారదా!...బయటికి రామ్మా" ... అన్నారు.

నేను సిగ్గుపడుతూ ... భయంతో ... మెల్లిగా అడుగులోఅడుగు వేసుకుంటూ వచ్చాను ... నేను గదిలోనుంచి వస్తూంటే రవి...నా వైపు చూశాడు... అయ్యో...సిగ్గుతో, భయంతో చచ్చిపోయినంత పనైంది నాకు. అయన రెప్పవాల్చకుండా ఆపాదమస్త కమూ నన్ను పరిశీలించారు.

నాన్న ప్రక్కన కుర్చీలో కూర్చున్నాను. ఆయన తన చూపుల్ని నా వైపునుంచి మరల్చలేదు. ఆయన కళ్ళు మెరుస్తున్నాయి. తలెత్తి ఆయనవైపు చూశాను. ఆయన మొహంలో అనాదరభావం గోచరించలేదు. అసహ్యత కనపడలేదు. నే ననుకున్నట్టు అతడు నన్ను చూచి నిశ్చేష్టితుడు కాలేదు. పరవశుడైనట్టు కనిపిం చాడు. కారణ మేమిటో...నాకు బోధపడలేదు. ఒక మహాశిల్పి హస్తాల్లో తయారైన శిల్పాన్ని చూచినట్టు నన్ను చూస్తున్నాడు.

నాన్న టైం చూచుకొని..."భోజనానికి లేవండి పన్నెండు కావస్తూంది" అన్నాడు. ముగ్గురం లేచాం. వాళ్ళిద్దరికి నే నే వడ్డించాను. భోజనాలైనయ్. అయన, మా నాన్న వరండాలో కూర్చుని తాంబూలం వేసుకుంటు న్నారు. నేను ఇంట్లో సర్దవలసినవి సర్ది...అప్పుడే బయటికి వస్తున్నాను. రవికుమార్ మాటలు వినిపించి

నయ్. అక్కడే ఆగి విన్నాను. "రిజిష్టర్ మ్యారేజి అయితే బాగుంటుందండి. మామూలు అట్టహాసాలు నాకు అంతగా నచ్చవు అన్నాడు.

"మీ యిష్టం? అలా నేకానిద్దాం. నేనుకూడా ఆడంబరాలు వాంఛించేవాణ్ణి కాను" అన్నాడు మా నాన్న.

అబ్బ! నాకూ పెళ్ళి జరుగబోతుంది. చీకటే... నిరాశా తప్ప మరొకటి లేదనుకొన్న నాజీవితంలోకి... వెలుగు రాబోతోంది... క్రొత్త ఆశలు చిగురిస్తున్నాయి. శిశిరం వెళ్ళిపోయింది. వసంతం రాబోతోంది. ఆనందం పట్టలేక...గదిలోకి వెళ్ళి పరుపుమీద పడుకునిదొర్లాను. ఆ సంతోషంలో అన్నం, నీళ్లుకూడా మరిచాను.

## 3

మా పెళ్ళి నిరాడంబరంగా జరిగిపోయింది. మర్నాడే, నేనూ, రవీ బెంగుళూరుకి బయలుదేరాము. ఫష్టుక్లాస్ కంపార్ట్‌మెంటుని, స్టేషన్‌మాష్టర్‌కి ఫోను చేసి రిజర్వు చేశాడు రవీ. అశ్రునయనాలతో నాన్న దగ్గర సెలవు తీసుకున్నాను.

రైలు వెళుతోంది. కంపార్ట్‌మెంటులో మేమిద్దరమే ఉన్నాం. రవి నావైపు తిరిగి......

"శారదా" అన్నాడు.

"ఊ" అన్నాను తలవంచుకొని. నాకు యింకా వారితో మాట్లాడాలన్నా, వారివంక చూడాలన్నా సిగ్గుగా ఉంది. నాదగ్గరకు వచ్చి, ప్రక్కన కూర్చుని నాచేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. నాభుజంమీద చేయి వేసి..."వెన్నెల చూడు ఎంత అందంగావుందో అన్నాడు. ఒక్క క్షణం ఆయనవేపు తన్మయత్వంలో చూశాను. అప్పుడు నాకు...అతడు మహావృక్షము వంటి వాడని... నేను...మారుతోద్ధతికికంపించే లతనని అనిపించింది. ఆవృక్షం, లతకి ఆశ్రయమిచ్చింది. లత వృక్షాన్ని గట్టిగా పెనవేసుకుంది. నాహృదయం చాలా సున్నితమైంది...ఆనందాన్ని గాని, దుఃఖాన్ని గాని...దేన్నీ...భరించలేను. దుఃఖంలో ఉన్నపుడు ...తుపాను ధాటికి ఆగలేక...చిగురాకులాగ విలవిలా కొట్టుకుంటాను. మహావాయు తీవ్రతకు ఆగలేక... ఏక్షణంలోనో... ఆరిపోవడానికి...సిద్ధంగావున్న... జ్యోతిలాగ బాధపడతాను.

అదే...ఆనందంలో ఉన్నప్పుడు.....ఈతరాక ...నీళ్ళలో మునిగి...అవస్థపడుతూన్న వ్యక్తివలె ఉక్కిరిబిక్కిరవుతాను.

అలాంటి సమయంలో...మరో వ్యక్తి...మరో హృదయం...మరో మనస్సు...ప్రక్కన ఉండి... దుఃఖాన్ని గాని... సంతోషాన్ని గాని...పంచుకుంటే ...నాకు...ఏదో భారం తగ్గినట్టు...ఏదో పెన్నిధి లభించినట్టు తోస్తుంది. రవిని కౌగిలించుకొనే...కిటికీలోనుంచి బయటకుచూశాను. శీతల చంద్రకిరణాలు ... పెన్నానదిలో ప్రతిబింబిస్తున్నాయి. క్షీర సాగర తరంగాల నుండి ఎగిరివస్తున్న తుంపురులవలె, ... విశ్వకర్మ ... దేవేంద్రుని నాట్యశాలా ప్రాంగణంలోని రజత స్తంభాలకి మెరుగులు పెడుతోంటే...రాలిన పొడివలెఉంది...వెన్నెల.

తెల్లని వెన్నెలను కల్మషం చేస్తూ...నల్లనిపొగని వదులుతూ...దూసుకుని వేగంగా వెళుతోందిరైలు. ఇంజనువదిలినపొగలు... మేఘాలతో కలసి...చంద్రుని మీద దండెత్తడానికి వెళుతున్నాయి...! చంద్రుడు తప్పించుకునిపోకుండా ఉండటానికి......మేఘాలు వ్యూహాలు పన్నుతున్నాయి. వాటి వ్యూహాలనుంచి తప్పించుకొని అతడు బయటకి వస్తూనే ఉన్నాడు.

నా బుగ్గమీద చల్లగా ఏదో తగిలినట్టయింది. ఉలిక్కిపడి చూశాను!...రవి పెదవులు నా బుగ్గల్ని తాకుతున్నాయి. నా ఊహలు స్తంభించిపోయినై. రైలు ఏదోస్టేషన్‌లో ఆగి మళ్ళీ కదిలింది...

"ఏస్టేషనండీ" అని అడిగాను.

"అనంతపురం" అన్నాడు రవి.

కిటికీలోనుంచి చూశాను...కొద్దిదూరంలో నే పెద్దభవనాలు కనబడుతున్నాయి. అవి ఏమిటని అడిగాను. అవి గవర్నమెంటు ఆర్ట్సుకాలేజి భవనాలట. వెన్నెల్లో ఆ భవనాలు చాలా అందంగా కనబడుతున్నాయి. కొద్దినిమిషాలలో......అనంతపురం వెనకే ఉండిపోయింది. మేము ముందుకు వెళ్ళిపోతున్నాం. చెట్లు, గుట్టలు మమ్మల్ని ఆహ్వానించటానికేమో అన్నట్టు దగ్గరకువస్తున్నాయి. మా రైలు వాటినేమీ గమనించకుండా పరుగెడుతోంది. అవి పాపం...నిరాశతో......మావైపే చూస్తూ వెనక్కి వెళుతున్నాయి.

నిద్రవస్తూంటే......బ్లాంకెట్ తీసి కప్పుకుని, నిద్రపోయాను. మేము బెంగుళూరు చేరేటప్పటికి... తెల్లవారి...ఆరున్నర అయింది. టేక్సీలో ఇంటికి వెళ్లాము.

ఇల్లు చామరాజ నగర్ లో ఉంది. ముచ్చటగా మాకు సరిపోయే డాబా. ఇంటిముందు...చిన్నతోట ఉంది. తోటలో రెండు పాలరాతి అరుగులు కూడా ఉన్నాయి. ఇల్లు నాకు బాగా నచ్చింది.

నేనావూరికి క్రొత్తగాబట్టి...నాకు ఊరంతా చూపించాడు, రవి...రోజులు ఆనందంగా గడుస్తున్నయ్. కాని మొదటి నుంచీ నామనసులో దాక్కుని ఉన్న...ఆత్మక్లేశం...నేను అందవిహీనను అనే బాధ నన్ను వదలలేదు ... అదొక పెద్ద వ్యాధిలా లోపల పట్టుకుంది. నేను రోజూ రవి గదిలోకివెళ్ళి...అతని కుంచెలు శుభ్రపరిచేదాన్ని. అత నెప్పుడూ ఏవో బొమ్మలు గీస్తూ కూర్చునేవాడు. మధ్యాహ్నం వేళ రంగులను కలుపుతూ...రవికి సాయపడేదాన్ని.

"శారదా... నేను చిత్రం గీసేటపుడు నీవు నా ప్రక్కన ఉంటే నాకు ఎంతో ఉత్సాహంగా ఉంటుంది" అనేవాడు. చిత్రం గీస్తూ మధ్య మధ్య నా వేపు చూసేవాడు. నన్ను చూస్తే తనకి 'ఇన్స్పిరేషన్' వస్తుందనేవాడు.

మధ్యాహ్నంపూట ఎప్పుడన్నా రవి నిద్రపోయేవాడు. నాకు మధ్యాహ్నం నిద్రపోయే అలవాటు లేదు. పుస్తకాలు చదువుతూనో, లేక...'ఆల్బం' చూస్తూనో కాలంగడిపేదాన్ని. ఆల్బం చూసేటప్పుడు మాత్రం...అణగిపోయి ఉన్న నాలోని ఆత్మక్లేశం మళ్లీ తలయెత్తేది.

ఒకరోజు మధ్యాహ్నం... నేను పత్రిక చదువుకుంటున్నాను. రవి మంచంమీద నిద్రపోతున్నాడు.అతని వైపు చూశాను. ప్రశాంతంగా నిద్రపోతూ ఉన్నాడు. ఏ ఊహాసుందరిని కల్పించుకుంటున్నాడో!...నిద్రలోనే నవ్వుతున్నాడు! అతని అందం...ఎలాంటిస్త్రీనైనా సమ్మోహపరుస్తుంది. ఈ మన్మథాకారుడు కోరి నన్ను పెళ్లి చేసుకున్నాడు. ఒకోసారి...ఇదంతా నిజమేనా! అన్నంత భ్రాంతి కలుగుతుంది నాకు. ఆల్బం చూశాను. దాల్లో ... ఎంతోమంది...సుందరాంగుల ఫొటోలు అంటించబడి ఉన్నాయ్. అవన్నీ అతని ప్రకటనకి సమాధానంగా వచ్చినవే...ఒకరిని మించి మరొకరు అందంగా ఉన్నారు. ఆ ఫొటోలన్నీ ఒకసారి తిరగేస్తే కన్ను చెదరిపోతుంది. నాఫొటోమాత్రం అందులో ఉంచలేదు. దాన్ని ప్రత్యేకంగా ఎన్లార్జి చేయించి, తన క్యాన్వాస్ పక్కనే మరొక బల్లమీద ఉంచాడు...తన కెప్పుడూ కనపడేలాగ...ఈ సాక్ష్యం చాలు...రవి నన్నెంతగా ప్రేమిస్తున్నదీ తెలియచెయ్యడానికి. అతనిదగ్గర నాకేలోటు లేదు. అతనిప్రేమలో, అతడు నాకందించే సౌఖ్యంలో... ఆనందంలో...కొరత లేదు. నాకోసం...కారుకూడ కొంటానన్నాడు!

నా జీవితం యింత ఆనందమయంగాఉన్నా... నాబాధనన్ను వదలిపోలేదు.వచ్చినకొత్తలో...అంతగా అనుకునేదాన్ని కాదు.అద్దంలో నన్ను నేను చూసుకున్నపుడు... నేనెంతోతక్కువదాన్నని...నన్నెదో ఉద్ధరించడానికి...రవి పెళ్ళి చేసుకున్నాడేమోనని అనిపించేది. స్త్రీలను చపలచిత్తలన్న మహాకవులు నిస్సందేహంగా పొరబడలేదు. మరోస్త్రీ అయితే...తనకిదొరికిన పెన్నిధానంతో హాయిగా జీవితాన్ని గడిపేది... నాలాగ ... ఆత్మహీనతాభావంతో...బాధపడి... సౌఖ్యమయజీవితాన్ని విషాదమయంగా ఎవరు చేసుకుంటారు!

## 4

రవి నన్ను నిజంగానే ప్రేమిస్తున్నాడా...! అప్పుడప్పుడు ఈ ప్రశ్న మనసులో ఉదయించేది. ఈ ప్రశ్నకి అర్థమేలేదు. నన్ను పెళ్ళిచేసుకున్నందుకు ... అతడు ... విచారిస్తున్నాడేమో అనుకునేదాన్ని. కాని...అతడు నిరుత్సాహంతో ఉండగా... నేనెప్పుడూ చూడలేదు. విసుక్కోవడమనేది లేనేలేదతనికి. అనేక ప్రదర్శనలలో అతనిచిత్రాలకి వెండి కప్పులు...పతకాలు...బహుమానాలువస్తే..."ఇవన్నీ నీవే...శారదా...నీవు లేకపోతే నాకివన్నీ లభించేవి కావు" అనేవాడు.

"ఏమండీ !... నేను నిజంగా మీకంటికి బాగున్నానా" అని అడగాలనుకునేదాన్ని. కాని అడగడానికి ధైర్యంచాలదు. అతని చిత్రాలని... జమీందార్లు...డబ్బుగలవాళ్లు కొనేవారు. ఒకో చిత్రానికి ... వెయ్యి...పదిహేనువందలు ... వచ్చేవి. ఒకోచిత్రం అమ్ముడుపోయినప్పుడల్లా నాకు బహుమానం తప్పదు. నెక్ లేసో — టాయిలెట్ సెట్టో పట్టుకొచ్చేవాడు. నేను నిద్రపోయేటప్పుడు...

నెక్ లేస్ నా కంఠానికి అలంకరించేవాడు. ఉదయం నేను లేచినపుడు... మెడకి ఏదో బరువుగా ఉంటుంది. ఏమిటా అని చూసుకుంటే హారం! ఇలాఉంటుంది... అతని బహూకరణ. నాపైన అతని ప్రేమ నిత్య నూతనంగా ఉండేది. అతడు నన్ను తన ప్రేమతో, ఉక్కిరిబిక్కిరి చేసేటప్పుడుకూడ...ఆ ప్రశ్న నన్ను వదిలిపెట్టి పోయేదికాదు. సంతోషమనే అమృతపు సముద్రంలో ఒక విషబిందువులాగ...ఆ ప్రశ్న నన్ను నా మనస్సుని కల్మషపరిచి బాధించేది.

ఆ రోజు...లాక్ బాగ్ కి షికారు వెళ్లాము. అతని ప్రక్కనే... నేను నడుస్తున్నా. అతని అందమెక్కడ ... నా అందమెక్కడ ...! దారిలో అందరు...మమ్మల్నే చూస్తున్నారేమొ అనిపించింది. అందమైన ఆడవాళ్లు...మావైపు పరకాయించిచూచి... నవ్వుతున్నట్లు తోచింది. వాళ్ల నవ్వు నన్ను వెక్కిరిస్తున్నట్టుంది. అంతి అందగానికి...ఈవిడ ఎక్కడ దొరికిందిరా...అని ఆశ్చర్యపోతున్నారేమొ! గ్లాస్ హౌస్ దగ్గర...ఒకచోట కూర్చున్నాము...మాచుట్టూ అందమైన చెట్లు ... రంగురంగుల పూలు...లతలు ఉన్నయ్. మేము కూర్చున్నచోట గడ్డి, తివాసీ పరచినట్లుంది...మెత్తగా. ఎక్కడ చూసినా అందమే...!

"ఏమండీ..."అన్నాను, అడగటానికిభయం... ఏమనుకొంటాడోనని.

"ఏం? శారదా" అన్నాడు.

"నేను, మీకు......"

"చెప్పు భయపడతావేం?..." అన్నాడు.

"నేను...మీ కంటికెలా ఉన్నాను..." అని ధైర్యం తెచ్చుకుని అడిగాను.

"ఇప్పుడెందుకుశారదా...ఈప్రశ్న"అన్నాడు.

"నేను నల్లగా ఉన్నానుకదా...మీ కెలా నచ్చాను."

రవి నవ్వాడు...నన్ను దగ్గరకు తీసుకున్నాడు. నేను సిగ్గుతో, భయంతో కుంచించుకుపోయాను.

"శారదా...నువ్వు...ఎంత అమాయికురాలివి! చిత్రకారుడికి ... నలుపురంగంటే ఎంత ఇష్టమో తెలుసా!" అన్నాడు.

ఈ జవాబు నన్ను తృప్తిపరచలేదు. చిన్న పిల్లల్ని మభ్యపెట్టినట్టుంది...!

అమాయకంగా...అర్థంకానట్టు ... అతనివైపు చూశాను.

"శారదా...నీలో ఉన్న సౌందర్యం సామాన్యమైందికాదు. నీ నలుపులోపల...ఎంత సౌందర్యం నాకు కనుపిస్తోందో...తెలుసా! నీ శారీరకరేఖలపై... అంగసౌష్టవంపై ... అంతస్సౌందర్యకాంతులు ప్రతిఫలిస్తున్నాయ్. నీలోని కళ నలుపుకాదు...నీ భావాలు నల్లనివికావు...నీ గుణం నల్లనిదికాదు...నీవొక శిల్పసుందరివి! నీవు ... శాపవశాత్తు ... అచేతనత్వాన్ని పొంది...శాపావసానసమయంలో...చేతనత్వాన్ని పొందిన పుత్తడిబొమ్మవు!

నీవు తెల్లగా ఉండి...బంగారపు రంగుతో నిగనిగలాడుతోంటే...అద్వితీయ సౌందర్యరాశివైన నీవు ఏ మహారాజుల అంతఃపురంలోనో...ఉండిపోయేదానివి. నా అదృష్టంవల్లనల్లనిదానవై...నాకు లభించావు. నాకు మహాసౌందర్యరాశి లభించింది...పిచ్చి పిచ్చి ఆలోచనలతో మనసు పాడుచేసుకోకు...వెఱ్ఱిదానా!...నీ నిజమైన రూపాన్ని చిత్రించానంటే...నిద్రిస్తూన్న నీ సౌందర్యప్రభని మేల్కొల్పితే......లోకం విభ్రాంతమై మైమరచిపోతుంది..."

నాకు నోట మాట రాలేదు. ఆయన్ను గట్టిగా కౌగలించుకున్నాను...అబ్బ!...నా అనుమానం పటాపంచలైపోయింది...హృదయం తేలికపడింది.

ఆ రాత్రంతా రవి అన్నమాటలే చెవిలో గింగురుమంటున్నాయి. రాత్రంతా నిద్రపట్టలేదు. రవిని చూస్తూ ఆలోచిస్తూ కూర్చున్నాను ... తెల్లవారింది. నాకళ్లు ఎర్రగాఉన్నయ్. ఇన్నిరోజులుగా నా మనసులోఉన్న అనుమానం నివృత్తి అయింది. కాని ఒక కొత్తకోరిక చిగిర్చింది. కాని ఆ పాడుకోరికే నా జీవితాన్ని నాశనంచేస్తుందని నాకేం తెలుసు!

రవి నిద్రనుంచి లేవగానే "ఏమండీ నా బొమ్మని అహా...నా నిజమైనసౌందర్యాన్ని చిత్రించరూ?..." అనడిగాను.

రవి...నాకేసి...చూశాడు. అతనిచూపుల్లో సానుభూతి ప్రదర్శిత మౌతోంది.

"వద్దు. శారదా!...అలాంటి పిచ్చికోరిక కోరకు. లేనిపోని అనర్థాలు ప్రాప్తిస్తాయి. నీసౌందర్యము నీలోనే ఉండనీ," అన్నాడు.

ఎన్నోవిధాల...వద్దని రవిచెప్పినా నేను వినలేదు... స్త్రీచాపల్యం!...నాసౌందర్యం.....ఎలాఉంటుందో

చూడాలనేఆ కొంక్షు...వీటిని అణచుకోలేకపోయాను. నా చిత్రం గీయమని బ్రతిమాలాను. బాధించాను, విసిగించాను. రవికూడా తన మనస్సును తాను అరికట్టుకోలేకపోయాడు. నా మనోవీధి తేజోమయమై పోయేలాగా వెన్నెలాలా ఒకచిరునవ్వునవ్వి, కుంచ తీసుకుని నిగనిగలాడుతున్న నల్లరంగులో కుంచ ముంచాడు.

## 5

నా జీవితంలో మరో ఘట్టం...అప్పటి నుంచే ప్రారంభం అయింది. నన్నొక వింతభంగిమలో నిలబెట్టి...అనేక కోణాలనుంచి చూస్తూ...నన్ను చిత్రింపసాగాడు రవి. ఆ చిత్రంలోని సౌందర్యానికి మెరుగులు దిద్దటంలో నిమగ్నుడైపోయాడు. అన్నం, నీళ్లు మరిచాడు. ఆ చిత్రానికి ఎంత మెరుగులు దిద్దినా...అతనికి తృప్తిలేదు...రానురాను...అతడు.. మాట్లాడ్డంతగ్గించాడు. ఎప్పుడూ ఆలోచిస్తూ...వింతగా ...పిచ్చిగా...బొమ్మకేసి చూస్తూ కూర్చునేవాడు. ఏవోఉన్మత్తభావాలలో పరవశుడైపోయేవాడు. చిత్రం నించి చూపు మరల్చి నావైపు పిచ్చిగాచూసేవాడు. మళ్లీ చిత్రరచనలో...నిమగ్నుడైయేపోవాడు. నిద్రపోవటంకూడాతగ్గించాడు. ఎప్పుడూ ఆచిత్రంముందేకూర్చోవటం.. తనలో తాను నవ్వుకోవటం......మొదలైనవన్నీ ప్రారంభమైనయ్!

నా మనసులో భయాందోళనలు ... కలుగసాగినయ్. రెండునెల్లకి...చిత్రం పూర్తయింది.

"శారదా" అని గట్టిగా అరిచాడు నన్ను చూసి. చిత్రాన్ని చూశాను.

అబ్బ!...ఎంత సౌందర్యం! నేను నమ్మలేక పోయాను. అది నా చిత్రమేనా...అని! నా బాహ్య శరీరాన్ని దూసుకునివచ్చి ఆత్మసౌందర్యం...రూపం దాల్చినట్లుంది. అద్భుతం ... సాక్షాజ్జగన్మోహిని ఆ చిత్రంలో అవతరించింది! నీలనీరదశుభాంగి! ఇంత సౌందర్యం...నాలో ఉందా! నాకు నాకే విభ్రాంతి!

కాని, ఆ రోజునుంచీ...నాకు మనశ్శాంతి పోయింది. సుఖంలేదు. రవి మాట్లాడడం పూర్తిగా తగ్గించివేశాడు. ఎప్పుడూ ఆ చిత్రం ముందు కూర్చుని...ఏదో ఆలోచిస్తూ...కాలం గడిపేవాడు. ఉత్సాహంతో ఇతర చిత్రాలు గీయటానికి... అతనికి మనసురాలేదు. నిరంతరం ఆ చిత్రంలో సౌందర్యరసాస్వాదనమే ... తప్ప ... అతడు వేరే పనిచేయడంలేదు. అతన్ని మామూలు స్థితిలోకి ఎలా తీసుకురావాలో నాకు తోచలేదు. భయంతో నా గుండె కొట్టుకోసాగింది. అతని దగ్గరకు వెళ్లటానికి... మాట్లాడటానికి...భయం.

"ఏమండీ ... లాల్ బాగ్ కి వెళ్దాం రండీ... మీకు హాయిగా ఉంటుంది" అన్నాను ఎలాగో. రవి గట్టిగా నవ్వాడు.

"ఇంకా ఏం లాల్ బాగ్. ఎందుకు వెళ్లాలి... అక్కడికి? ఏ ముందెక్కడ, ఇంతకుముందు సౌందర్యాన్వేషణకై వెళ్లేవాడిని. ఇప్పుడు ప్రపంచంలో ఎక్కడా లేని సౌందర్యం...నాదగ్గరే...నాయింట్లోనే ఉంది! నేను రాను...కావలిస్తే...నువ్వు వెళ్లు అన్నాడు.

ఏమనటానికి నాకు మాటరాలేదు. ఎప్పుడూ అతన్నిగురించి ఆలోచిస్తూ కూర్చునేదాన్ని. ఒక రోజున ఒక జమీందారు...తను కొత్తగా కొన్న భవనంలో అలంకరించడానికి...ఏవైనా చిత్రాలుకొందామని వచ్చాడు. గదిలోని నా చిత్రాన్ని చూచి... ముగ్ధుడై...ఎంత వెల అయినాసరే...ఆచిత్రాన్ని కొంటానన్నాడు. రవి అతనివైపు పిచ్చిగా చూశాడు. "ఏమిటీ...... నా భార్యని......అమ్మమంటారా! నాభార్యను ధరకు అడుగుతారా ... ఇక్కడనుంచి ముందు బయటికి వెళ్ళండి" అని అరిచాడు. అతని కేకతో ఇల్లు ప్రతిధ్వనించింది. ఆ జమీందారు భయపడి ... బయటికి పరుగెత్తాడు. ఇలానే ... ఇంకా కొంత మంది ఆ చిత్రంకోసం వచ్చి...రవిచేత బాగా తిట్లు తిన్నారు.

ప్రసిద్ధ చిత్రకారుడు....రవికుమార్ కి....తాను రచించిన చిత్రంవల్లనే మతిభ్రమించింది...అని అక్కడక్కడ అనుకోవడం మొదలు పెట్టారు.

ఏడ్పుని ఆపుకోలేకపోయాను. రవిని...ఎలా తీసుకురావాలి...మామూలుస్థితికి? ఒక ఆలోచనతట్టింది. ఆచిత్రాన్ని నాశనంచేస్తే?..కాని నాశనం చేయటంకన్న ..ఆరోజువచ్చిన జమీందారుగారికే... లేక మరెవరికో అమ్మివేస్తే...బాగుంటుంది. ద్రవ్యలాభమూఉంటుంది ...అనుకున్నాను.

వెంటనే జమీందారుగారికి...కబురు పంపించాను. నా భర్తకి మతిస్థిరం తప్పిందనీ...ఆయనకు

తెలియకుండా - చిత్రం తీసుకువెళ్ళమనీ... వ్రాశాను. ఆ చిత్రం ఎదురుగా లేకపోతే...అతడు బాధపడ తాడని ఆశించాను.

అదేవిధంగా ఒక రోజు రాత్రి...జమీందారు వచ్చాడు. రవి నిద్రపోతున్నాడు. నేను...నా అద్భుత చిత్రాన్ని...జమీందారు కిచ్చేసి...పదివేల రూపాయలు పుచ్చుకున్నాను. ఆయన చిత్రాన్ని తీసుకొని వెళ్ళిపోయాడు. ఇక రవికి...ఏమని సమాధానం చెప్పాలి? అతను ఎలామార్గానికి వస్తాడు. ఈ ఆలోచనలతోనే గడుపుతున్నాను...

ఇంతలోనే...రవి లేచాడు. చిత్రంకోసం బల్ల వైపు చూశాడు. అది కనుపించకపోయేటప్పటికి ... "ఏదీ? నా సౌందర్యరాశి ... నా ప్రియురాలు ఎక్కడ?... నా చిత్రసుందరి...ఏది?" అంటూ గదంతా వెదకుతున్నాడు. గబగబా వెళ్ళి అతనిని పట్టుకుని... మెల్లగా "పోతేపోయింది లెండి...అంతకన్న మంచిచిత్రం...మరొకటివ్రాయవచ్చు...ఇదో! యిలా చూడండి...పదివేల రూపాయలు..." అన్నాను.

"ఆ! ఎక్కడివి?"

"ఆ చిత్రానికి...ఒకరు...ఇచ్చారు" అన్నాను.

రవి మండిపోయాడు: "ఒసే రాక్షసీ! ... నా భార్యను అమ్మివేశావా? ఎవడువాడు...వాడిని చిత్రవధచేస్తాను. నా సౌందర్యాధిదేవతకి...ఒకధరా? ఛీ ఛీ నీచురాలా! ... అసలు నీకు దాని నమ్మడానికి చేతు లెలావచ్చాయి" అని రవి రౌద్రాకారంతో అరుస్తూ కరెన్సీనోట్లన్నీ ఇష్టమొచ్చినట్లు గదంతా చిమ్మేశాడు.

అమితమైనభయంతో నేను గట్టిగా అరిచాను. ఆఅరువు విని చుట్టుప్రక్కలవాళ్ళంతా వచ్చారు. రవి యింకా "నారాణి, నా సౌందర్యం...నా చిత్రం అంటూ అరుస్తూంటే వాళ్లు అతన్ని పట్టుకున్నారు. అంతే ... అప్పటినుంచీ ... నా రవికి ... నేను నా సర్వస్వము...అనుకున్న రవికి, పిచ్చాసుపత్రి శరణ్యమైంది. నేను చేసిన పనికి ఎంత విచారిస్తే ఏం లాభం చేతులారా... నేనే...నా జీవితాన్ని పాడుచేసుకున్నాను. నారవిని పోగొట్టుకున్నాను. గుప్తంగా ఉన్న నా సౌందర్యాన్ని చిత్రించమని అతన్ని ఎందుకు బాధించానాఅని అహోరాత్రాలుఏడ్చాను. హాస్పిటల్ నివాసం ఆ సుకుమార దేహం భరించలేకపోయింది. నిరంతరమూ ఆ చిత్రాన్నిగురించి కలువరించేవాడు. గోలగా కేకలువేసేవాడు. ఒకరోజున అతనికి తీవ్రంగా జ్వరంవచ్చింది. నేను...అతని ప్రక్కనే కూర్చుని... పాలు చల్లార్చుతున్నాను...

"శారదా" ... అన్నాడు-అలా పిలిచి ఎన్నాళ్ళయింది!

అతని వైపు ఆశగా చూశాను. దీనంగా ఉంది అతని ముఖం. ఒకనాడు ఎంతో సౌందర్యంతో వెలిగిపోయిన ఆ ముఖం...అప్పుడు...ఎంతో దీనంగా... మాసిపోయిన గడ్డంతో ఉంది. నాగుండె తరుక్కుపోయింది. కన్నీళ్లు ఆపుకోలేకపోయాను — అతను నూతిలోనుంచిలా మంద్రస్వరంలో:

"నీ సౌందర్యాన్ని చిత్రించమని ఎందు కడిగావు శారదా!...ఎంతో శ్రమించి ... రేయింబవళ్లు కృషి చేసి...చిత్రిస్తే...దాన్నెందుకు నానుంచి...దూరం చేశావు?..."

"నన్ను...క్షమించండి...క్షమించరూ?... మీ పాదాలు పట్టుకుంటాను ... క్షమించరూ?... మీరు త్వరగా బాగవుతే...చాలు" అన్నాను ఉద్వేగంతో.

"అహ్హహ్హ...శారదా...పిచ్చిశారదా...ఇంకా నాకిక్కడేముంది...అదో...చూడు...ఆ సౌందర్యలోకం...అక్కడినుంచి...నాకు పిలుపువచ్చింది... వెళ్ళిపోతా...వెళ్ళిపోతా...మళ్ళీ అక్కడ కలుసుకుందాంలే...ఏమనుకోకు...నిన్ను వదలిపెట్టి ముందు వెళ్తున్నందుకు! ... శారదా! ... భగవాన్!..." అంటూ కళ్ళుమూశాడు. అంతే! నా జీవనజ్యోతి ఆరిపోయింది. లతకి ఆశ్రయమిచ్చిన మహావృక్షం కూలిపోయింది.

అయన్ని ఆ సౌందర్యలోకంలో కలుసుకునే ఆ శుభసమయాన్ని నాకు భగవంతుడెప్పుడు ప్రసాదించుతాడో!...కాచుకుని ఉన్నాను.